# మట్టి బొమ్మలు

'రేపే! రేపంటే రేపే పండగ! చీకట్లోనే లేవాలి! అందరికంటే ముందే లేవాలి! బుల్లోడికంటే ముందుగా లేవాలి! వాడికంటే ముందేపోయి నల్ల చెరువులోని తెల్లటి, ఎర్రటి కలువ పువ్వులు కోసుకు రావాలి! బుల్లోడి వినాయకుడికంటే తన వినాయకుడికే ఎక్కువపువ్వులూ, కొడలూ అందంగా పెట్టాలి!'

తండ్రి ప్రక్కలో పడుకొన్న కిష్టుడి చిట్టిబుర్రలో, వూహాలు సముద్రపు అలల్లా అనంతంగా సాగిపోతున్నయ్.

ఏడుసంవత్సరాలనాడు, కిష్టుడి తల్లి పోతూ, పోతూ రెండేళ్ళ పసికందును భర్త విశ్వనాథం చేతుల్లోవుంచి కళ్ళు మూసింది. తనబిడ్డ భవిష్యత్తుగురించిన ఆలోచన బాధలతోనే లక్ష్మీకాంతం తన ఆఖరి రోజులు గడుపుకొంది.

అంత చిన్నవయస్సులో వున్న తనభర్త రెండో పెళ్లి చేసుకోకుండా వుండగలుగుతాడని ఆమె ఎప్పుడూ భ్రమపడలేదు. తను లేని కొరతను విశ్వనాథానికి మరో లక్ష్మీకాంతమో, కనకమో తీర్చగలదని ఆమెకు గట్టిగా తెలుసు. అందుకే, భర్తకోసం ఆమె అంతగా దిగులుపడలేదు. కాని కిష్టుడికి, మరో లక్ష్మీకాంతంగానీ, కనకంగానీ తలికాలేదని ఆమెశరీరంలోని ప్రతిజీవకణం ఘోషించి చెప్పింది ఆమెకు. సవతితల్లి చేతికింద పెరగాల్సిన తన కిష్టుడి భవిష్యత్తుని తలుచుకొని కుళ్లికుళ్లి ఏడ్చేది. అలా ఏడ్చిఏడ్చి అసలే నీరసించిపోతూన్న శరీరాన్ని మరీ కృశింపచేసుకొంది. తన బిడ్డ భవిష్యత్తుని గురించిన ఆందోళన, ఆవేదనలతో మృత్యువు వొడిలోకి ప్రాకిపోయింది, పాపం లక్ష్మీకాంతం చాలా చిన్నవయసులోనే!

అయితే, లక్ష్మీకాంతం కడుపుతీపికొద్దీ పొందినంత ఆందోళన, భయం, సవతితల్లి కనకమ్మక్రింద పెరుగుతూన్న కిష్టిగాడికి లేదనే చెప్పాలి.

కనకమ్మ, కనకంగా నలుగుర్లోనూ మంచి అనిపించుకొన్నా, విశ్వనాథం రెండో పెళ్ళాంగా, కిష్టిగాడి సవతితల్లిగా మంచి అనిపించుకోలేకపోయిందంటే అందులో కనకం తప్పేమీ లేదు. భర్త విశ్వనాథమూ, లోకులూ కనకాన్ని సవతితల్లిగా చూట్టమే కనకమ్మలో సవతితల్లి మనస్తత్వం ఏర్పట్టానికి ప్రధాన కారణమేమో!

తన కొడుకు ప్రసాద్‌ను వోవిధంగా, కిష్టుణ్ణి మరోవిధంగా విశ్వనాథం చూస్తున్నాడనే అనుమానం కనకమ్మకు రానురాను పెరిగిపోయింది. భర్త ప్రవర్తనను సహించ

"వనశ్రీ"

లేని కనకమ్మ ప్రతీకారంగా కిష్టుడిపై మనస్సులో ద్వేషం అసూయను పెంచుకొంటూంది?

కిష్టుడిపట్ల కనకమ్మ కరుకుతనం పెరుగుతూన్న కొద్దీ, కిష్టుడు విశ్వనాథానికి మరీ దగ్గరౌతున్నాడు.

ప్రతిరోజూ, ప్రతి నిముషం, ప్రతి ఘడియా ప్రేమ, ద్వేషం, రక్తసంబంధం, సంఘుబాంధవ్యంతో సమ్మిళితమైన యీ సుడిగుండం బలపడిపోతూంటే, ఘోరున తిరుగుతూన్న యీ సుడిగుండంలో తండ్రీ-సవతి తల్లీ మధ్యపడి అభం శుభం తెలియని తొమ్మిదేళ్ళ కిష్టిగాడూ గిరగిర తిరిగిపోతున్నాడు!

కాలచక్రం యింకో వినాయక చవితిని మోసుకొచ్చింది! కిష్టుడి మనసు రెపరెపలాడింది!! తండ్రి పక్కలో కిష్టుడు అటూయిటూ కదిలాడు.

తొలికోడి కూసింది. వేపచెట్టుమీద తల్లికాకి పిల్లల్ని మేలుకొలుపుతూంది! పెద్ద రావిచెట్టుమీద కొంగలు తెల్లటి రెక్కలు

(52 వ పేజీ చూడండి)



# ★ మట్టిబొమ్మలు

(11-వ పేజి తరువాయి)

విప్పుకొని వొక్కొక్కటే లేచిపోతున్నయ్. పనిమనిషి పాచి వూడుస్తోంది. జీతగాడు గేదెకు కుడితి పోస్తున్నాడు. ప్రపంచం బలువుగా ఆవలించి మత్తు ముసుగులోంచి బయటికొస్తోంది!

మామిడితోపులో పక్షుల కలకలం దూరంగా వినపడుతోంది. నీలిమబ్బులు చుట్టలు చుట్టుకొంటూ దొర్లిపోతున్నాయ్; చల్లటి నీటిగాలి మెల్లగా తాకుతోంది.

కిషుడు తండ్రి ప్రక్కలోంచి చివాలున లేచి కూర్చున్నాడు.

"ఏరా కిష్టూ! యివ్వాళ యింత పొద్దున్నే లేచావ్?" తండ్రి మంచం దిగుతూ, కొడుకును చూసి అన్నాడు.

"వినాయకుడికి పూలు కోసుకురావొద్దు నాన్నా!" లాగు పైకి లాక్కుని వెనక్కి తిరుగుతూ కిష్టుడు వుషారుగా అన్నాడు.

"అయితే, కాసేపుండి చిన్న జీతగాడి పని కాగానే, వాడ్ని తీసుకొనివెళ్ళు!" కొడుకు లాగు బిగిస్తూ అన్నాడు తండ్రి.

"ఊఁ కాదు! యిప్పుడే పోవాలి! ఎండెక్కిపోతే కలేపూవులు దొరకవే; అందరూ కోసుకెళ్తారు; నాన్నా!" మారాంగా అన్నాడు కిష్టిగాడు.

చిన్న జీతగాడ్ని తీసుకొని కిష్టుడు విఘ్నేశ్వరుని పూజకు పువ్వులు పత్రీ కోసుకురావటానికి బయలుదేరాడు.

నాగేశ్వరస్వామిగుడి ఆవరణలో వున్న మారేడుపత్రీ, వనంతోపులో మామిడి మండలూ, ఆచార్యులగారి దొడ్లో గన్నేరు పువ్వులూ కోసుకొన్నాక; కిష్టుడూ, చిన్న జీతగాడూ నల్లచెరువుదగ్గర కెళ్ళారు. చెరువులో తెల్లటి కలువపువ్వులూ, ఎర్రటి తామరపువ్వులూ కోసుకొని మోయలేని పూలూ పత్రీ బరువుతో కిష్టుడు యింటికి వెళ్ళాడు.

ఇంటికి రాగానే అరుగుమీద చాపపరచి తను తెచ్చిన పూలూ, పత్రిని విడివిడిగా పేర్చి పెట్తూన్న కిష్టుణ్ని, సవతితల్లి కనకమ్మ పిల్చి, ఒక అణాయిచ్చి వినాయకుణ్ని కొనుక్కురమ్మని పంపింది.

"సవతితల్లి యిచ్చిన అణా తీసుకొని అమితసంతోషంతో, వొక్క పరుగులో కిష్టుడు కుమ్మరి బ్రహ్మయ్యదగ్గరకొచ్చి వాలాడు.

కుమ్మరి బ్రహ్మయ్య నీడలు తేలుతూన్న వల్ల రేగడిమట్టితో వినాయకుడి బొమ్మలు రకరకాలుచేసి, సైజులవారిగా అమర్చి అమ్ముతున్నాడు. బ్రహ్మయ్య కిష్టుడిదగ్గర అణా పుచ్చుకొని చిన్నరకం వినాయకుడి బొమ్మనిచ్చాడు.

అయితే కిష్టుడు అంత తేలిగ్గా వొదిలే రకంగాదు. కిష్టుడు బ్రహ్మయ్యతో పోట్లాడి పెద్దబొమ్మ, మంచిది ఏరి కోరి తీసుకొని యింటికి పరుగు లంకించుకొన్నాడు.

వీధిలో ఎదురుగా, బెదిరిపోయి పరుగెత్తుకొస్తూన్న ఆవుదూడను తప్పుకోబోయి కిష్టుడు బొక్కబోర్లాపడ్డాడు! పాపం! కిష్టిగాడి చేతుల్లో వినాయకుడు కాస్తా పోయి నేలకు కరుచుకొన్నాడు! దిమ్మరపోయి లేచి కూర్చున్నాడు కిష్టుడు. మోకాలు, మోచేయీ కొట్టుకుపోయి ఎర్రగా, రక్తం కారుతూంది. ఆదుర్దాగా లేచి వినాయకుడి బొమ్మను చేతుల్లోకి తీసుకొని అటూ యిటూ తిప్పి చూశాడు!

వినాయకుడూ, కిష్టుడిలాగానే బొక్కబోర్లా ముందుకు పడ్డాడేమో, ముఖం అప్పచ్చిలా అయిపోయింది! తొండం కాస్తా కడుపులోకి కూరుకుపోయింది! బొజ్జ గుండెలమీదకు ఎక్కిపోయింది! విఘ్నేశ్వరుని వాహనం - ఎలుక - బొడ్లోకి దూరిపోయినట్టుంది! ఫాలభాగం, ముక్కూ, కళ్ళూ, దంతాలూ అతుక్కుపోయి కనపడీ కనపడకుండా లీలామాత్రంగా వున్నాయి.

ఆ స్థితిలోవున్న వినాయకుణ్ని చూసేసరికి కిషుడికి ఏడుపాగిందికాదు. కళ్లనిండా నీళ్లుతిరిగాయి. కిష్టుడు బొటబొటా కార్చిన కన్నీళ్ళతో వినాయకుడి మట్టిబొమ్మ తడిసిపోయింది! కిషుడు చేయరాని మహా నేరమేదో చేసినవాడిలా వణికిపోయాడు. దేముడికి మహాపచారం చేసినట్టుగా వాడి లేత హృదయం కంపించిపోయింది. వినాయకుడి బొమ్మను భద్రంగా వళ్ళో పెట్టుకొని రెండు చెంపలూ వేసుకొన్నాడు. బొమ్మను కళ్ళకద్దుకొన్నాడు. ముఖం, తొండం, బొజ్జా అతుక్కుపోయిన మట్టిబొమ్మ కళ్ళల్లోకి జాలిగా చూశాడు. వినాయకుడికి బాగా దెబ్బతగిలి బాధపడ్తున్నట్టుగా వాడి చిట్టి బుర్రకు అనిపించింది. భక్తిపూర్ణమైన ప్రేమతో కిష్టుడి లేత హృదయం నిండిపోయింది.

మానవుని రక్తకణాల్లోని అంతర్గతవాహిని - ఆరాధనా, భక్తీ, ప్రేమా, మమతా - కిష్టుడి రక్తంలో ప్రవహించాయి! అతి శ్రద్ధగా ఆ మట్టిబొమ్మను గుండెలకు అద్దుకొని తొరతొరగా యింటివైపు నడిచాడు.

అలస్యమైనందుకు సవతితల్లి కనకం కోప్పడుతుందని కిష్టుడికి తట్టకపోలేదు. వినాయకుణ్ణి క్రింద పడేసినందుకు కనకమ్మ యేంచేస్తుందోనన్న భయంతో వాడిగుండెలు వేగంగా కొట్టుకొన్నయ్. సవతితల్లి చింతనిప్పుల్లాంటికళ్ళు, ఏవగింపుతో కూడిన ఆమె ముఖం, ద్వేషపూరితమైన ఆమె రుసరుసలూ - తలుచుకొంటున్నకొద్దీ వాడి పసిహృదయం బరువెక్కిపోతూంది. సుడిగాలిలా లేస్తూన్న ఆ వూహాలకు వాడి చిట్టి మనసు చెదిరిపోయింది.

కిష్టుడు యింటికొచ్చేసరికి పూజామందిరం, పువ్వులూ ఆకులతో అలంకరించడం; దానిపై పాలవెల్లి కట్టడం అయిపోయింది. కిష్టుడి అదృష్టం బాగుండి, వాడు వెళ్లేసరికి ఆ గదిలో ఎవ్వరూ లేరు.

కిష్టుడు అటూయిటూ, చూసి గబగబా వినాయకుడి బొమ్మను చొక్కాచాటు నుంచి తీసి పూజామందిరంమీద వుంచి; దానిపై యిన్ని ఆకులూ, మండలూ కప్పి బయటికొచ్చాడు. తన కొడుకు ప్రసాద్‌కు తలంటిపోస్తున్న కనకమ్మ కిష్టుడు చేసిన ఆలస్యానికి ఏమీ అనలేదు.

కొడుక్కి వొళ్ళుతుడుస్తూ కనకమ్మ కిష్టుణ్ని చూసి——

"ఒరే! కిష్టూ! నువ్వుకూడా చొక్కా విడు" అంది; చిన్న జీతగాడు రామిగాణ్ని పిలిచి, "వాడి క్కాస్త చమురంట" మంది.

తలంట్లయాక, ప్రసాదూ కిష్టుడూ కొత్త గుడ్డలు కట్టుకొని; పలకా పుస్తకాలకు పసుపూ కుంకం రాయటంలోనూ, పాలవెల్లికి కలువపూలూ, తామరకాడలూ, మామిడిమండలూ కట్టడంలోనూ నిమగ్నమైపోయారు. కనకమ్మ వుండ్రాళ్ళు వండడంలోనూ, పూజా సామగ్రిని సమకూర్చడంలోనూ మునిగిపోయింది.

"ఒరే! కిషూ! యింకా కాలేదట్రా?" అంటూ విశ్వనాథం పురోహితులు త్రిపురయ్యగార్ని వెంటబెట్టుకొని వచ్చాడు.

"అమ్మాయ్! తొందరగా రావాలి! అవతల రామయ్యగారింటికికూడా పోవాలి." అని హడావిడిగా తిరుగుతున్న కనకమ్మను హెచ్చరించి; పురోహితుడు పూజామందిరం దగ్గర చతికిలపడ్డాడు.

కిష్టుడూ, ప్రసాదూ తమతమ పలకా పుస్తకాల్తోనూ, గణపతిపూజా పుస్తకంతోనూ వచ్చి పూజామందిరానికి ఎదురుగా చిరుచాపమీద కూర్చొన్నారు. వాళ్లిద్దరికీ కుడిపక్క పురోహితుడు త్రిపురయ్యగారూ, ఎడంపక్క తల్లీ తండ్రీ వచ్చి కూర్చొన్నారు. పూజామందిరానికి

కొంచెం ఎడంగా వాకిట్లో జీతగాళ్లిద్దరూ, పనిమనిషి ఆదెమ్మా, ఆ పిల్లల్నిద్దర్నీ, పూజామందిరాన్నీ, పాలపళ్లినీ దీక్షగా చూస్తూ కూర్చున్నారు.

కనకం లేచి సాంబ్రాణికడ్డీలు వెలిగించింది. పిలలిద్దరూ మంత్ర ముగ్ధులై నిర్మల హృదయాల్తో అమాయకంగా, పురోహితుణ్నీ, పూజామందిరాన్నీ చూస్తూ వున్నారు. విశ్వనాథం రత్నాల్లాంటి యిద్దరి కొడుకుల్నీ, పట్టుచీర బరబరల్లో అందమూ, యవ్వనమూ, ఐశ్వర్యమూ వలకబోస్తున్న కనకాన్ని నిండుగా చూస్తూ, సంతృప్తితో కూర్చున్నాడు.

పురోహితుడు పూజ ప్రారంభించబోతూ, పూజామందిర మీమ్మదున్న వస్తువుల్నీ, పూజా పత్రినీ సర్దుతూ—

"అమ్మాయ్! ఎక్కడా విఘ్నేశ్వరుడు?" అన్నాడు.

"ఏరా కిష్టూ! ఎక్కడ్రా పెట్టావన్నావ్?" తీక్షణంగా చూస్తూ కనకమ్మ అడిగింది.

కిష్టుడి చిట్టిబుర్రలో అగ్నిపర్వతాలు బ్రద్దలయ్యాయ్! వాడి లేతహృదయంలో సప్తసముద్రాలూ ఘోషించాయ్!

మామిడి మండల్లోనూ, మారేడు దళాల మధ్యనూ, కలువపూవులమధ్యా కనీ కనపడకుండా వున్న విఘ్నేశ్వరుణ్ణి వణికిపోతున్న చేత్తో చూపించాడు. ఎలా చూపించాడో ఆ విఘ్నేశ్వరునికే తెలియాలి!

పురోహితుడు ఆకులూ, కాడలమధ్య వున్న వినాయకుడి మట్టిబొమ్మను బయటికి తీశాడు!

ఆ మట్టిబొమ్మను చూస్తూ, విశ్వనాథం, కనకమ్మ, పురోహితుడూ కొయ్యబొమ్మల్లా అయిపోయారు!

"ఇదేం విఘ్నేశ్వరుడమ్మా! వట్టి మట్టిముద్దయితేను? ఎంత అపచారం! పార్వతీ తనయునకా ఇంత అపచారం జరిగేది?" వూపిరి బిగపట్టి నొక్కి నొక్కి ఉచ్చరిస్తూ వుద్విగ్నుడై అన్నాడు. పూజారి త్రిపురయ్య - "అవిఘ్నమస్తు! అవిఘ్నమస్తు!" అన్నాడు.

కిష్టిగాడి కొత్త చొక్కా కింద వీపుమీద కనకమ్మ కుడిచేతి ఐదు వేళ్ళూ పొంగినై! కిష్టిగాడు కెవ్వున అరిచి తండ్రిని కావలించుకొన్నాడు.

విశ్వనాథం రాతిస్తంభంలా ఉండిపోయాడు.

"పోనీయమ్మా! ఏదో పసితనం! ఇంకో విఘ్నేశ్వరుని ప్రతిమ త్వరగా తెప్పించండి!" వళ్ళు మండివున్న కనకమ్మను చల్లారుస్తూ అన్నాడు పురోహితుడు.

"పో నాయనా! నీ వెళ్ళి తెచ్చుకో! జీతగాణ్ని తీసుకెళ్ళు! ఇక్కడున్నట్టు రావాలి!"

కొడుకు ప్రసాద్‌కు డబ్బులిచ్చి కనకమ్మ బజారుకు పంపించింది.

"ఇంతేనండీ త్రిపురయ్యగారూ! వాడినేపనికి పంపించినా యిట్లాగే చేస్తాడు. అదేం అనే వీలులేదు. పైగా లోకం నన్నాడిపోసుకొంటుంది, వాణ్నేదో నేను కొట్టికోరతనేస్తున్నట్టు!" భర్తవంకా, అతని వళ్లో వున్న కొడుకువంకా అదో మాదిరిగా చూస్తూ అంది. పురోహితుని చేతుల్లో వున్న నల్లరేగడిమట్టిసుద్దను - కిషిగాడి యిష్టదైవాన్ని, వినాయకుణ్ని తీసుకొని పోగులోకి విసిరేసింది.

అంతలోకే, ప్రసాదు బాగా అచ్చుపోసి వున్న వినాయకుడి బొమ్మను తీసుకొచ్చాడు. ప్రసాద్ తెచ్చిన విఘ్నేశ్వరుని ప్రతిమకు, ఏనుగు తలా, తొండం, బొజ్జా, కింద మూషికవాహనం అన్నీ హంగుల్తో కొట్టొచ్చినట్టు ప్రస్ఫుటంగా వున్నయ్. ప్రతిమను అందుకొని పూజామందిరంపై వుంచుతూ పురోహితుడు త్రిపురయ్య—

"సభాష్! విఘ్నేశ్వరుడంటే యిలా వుండాలి!" అన్నాడు.

కనకమ్మ సగర్వంగా కొడుకును చూసింది. ప్రసాదు కొంటెగా కిష్టుడివైపు చూశాడు.

కిషుడు జాలిగా ఆ విఘ్నేశ్వరుని ప్రతిమవైపు చూశాడు. కన్నీళ్ళు పెట్టుకొని వచ్చిన పసిగందు చూపుల్లో లేతహృదయం మూగబాధ ప్రవహించింది!

ఆ మట్టిబొమ్మలో, నిజంగా దేముడే వుంటే ఆ చూపులకు సిగ్గుపడి, కుళ్ళి క్రుశించి, చీకి ఆ మట్టిలోనే కలిసిపోయేవాడేమో?

పురోహితుడు పూజచేయించి, రావాల్సినంతవరకూ రాబట్టుకొని చక్కాపోయాడు.

సాయంకాలం కిష్టుడూ, ప్రసాదూ వుండ్రాళ్లు జేబుల్లో పోసుకొని బయటికి బయలుదేరారు.

పోగులోవున్న మట్టిబొమ్మను చూపిస్తూ ప్రసాదు "ఒకేయ్! కిష్టూ! నీ వినాయకుడు యిదుగో రా! కుప్పలో-" అని 'హిహి' అంటూ యికిలించాడు. కిష్టుడు చేతులో వున్న వుండ్రాయితో ప్రసాదు కణతకేసి లాగి కొట్టాడు!

ప్రసాదుగూబ గుయ్యిమంది! బొబ్బలు పెట్టి ఏడుస్తూ యింటోకి పరిగెత్తాడు.

కిష్టుడు నిశ్చలంగా, రూపూ ఆకారం లేకుండా పేడా, చెత్తా అలుముకునివున్న మట్టిబొమ్మను తీసుకొని, శుభ్రం చేసి దొడ్లో వున్న వేపచెటుతొర్రలో దాచిపెట్టాడు. అక్కడక్కడా ఆకూ [illegible] పువ్వులూ తెచ్చి చెట్టుతొర్రలో వున్న మట్టిబొమ్మపై వుంచి రెండుచేతులూ జోడించి వెక్కి వెక్కి ఏడ్చాడు.

కిష్టుడు ఏమని ప్రార్థించాడో, ఏం అర్థించాడో, ఎందుకు వెక్కి వెక్కి ఏడ్చాడో, తన దేముడికి జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా ఏం శపథం చేశాడో, ఏమని తన ప్రియతమమైన ప్రతిమను వూరడించాడో, చెటుతొర్రలోవున్న మట్టిబొమ్మకు, రూపూ, రేఖాలేని ఆమట్టిబొమ్మకు - రేగడిమట్టికి; చలనరహితమై, చలనధాతువుని అందించే మట్టికి; నిర్జీవమై, జీవితసారాన్ని అందించే మట్టికి - ఆ మట్టిబొమ్మకే తెలియాలి!

ఆ రాత్రి కిష్టుడు చాలా ఆలస్యంగా వచ్చి తండ్రి పక్కలో పండుకొన్నాడు.

* * *

తెల్లవారి వుదయం వినాయకుణ్ని కోనేట్లో కలపటానికి పూజామందిరంలోంచి బయటికి తీస్తూనే "అమ్మా! వినాయకుడే!" అంటూ బావురుమన్నాడు ప్రసాదు, ఎదురుగా నుంచొన్న తల్లిని చూసి.

వినాయకుడు కాస్తా మట్టిసుద్దయి కూర్చున్నాడు! విఘ్నేశ్వరుని రూపూ, ఆకారం నల్లరేగడి మట్టిలో కలిసిపోయినై! ఆ గణపతి ప్రతిమపై - మట్టిబొమ్మమీద - నున్నటి గుండ్రని బొజ్జా, ఏనుగు తలా, ఎలుకా అంతరించిపోయి వాటికి బదులుగా, సన్నటి చిన్నివేళ్ల గుర్తులు మాత్రం మిగిలినై!!

సవతితల్లి కనకమ్మ కేకలకు, మట్టి చేతుల్తో కళ్ళు నులుపుకుంటూ, తండ్రి పక్కలో మగతనిద్రనుంచి లేచి కూర్చొన్నాడు కిష్టిగాడు. ★


హకల్ బెరిఫిన్
వెల రూ. 2-0-0
రాజూ - ఫేదా
వెల రూ. [illegible]-0-0
ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-1

MONEY'S
MODEL LETTER - WRITER &
BUSINESS CORRESPONDENCE
224 Pages! Price Rs. 1-8-0
Postage As. 10.
A. S. Money & Co., (P.A)
14, Sambier Street, Madras-1.